నొప్పి తెలియకుండా గమ్మత్తు!

● అనెస్తీషియాతో నొప్పి లేకుండా ఆపరేషన్లు
● ప్రసవాలు కూడా..
● పెయిన్‌క్లినిక్‌లకు పెరుగుతున్న ఆదరణ
● కర్నూలు పెద్దాసుపత్రిలో ప్రతి ఏటా 30వేల శస్త్రచికిత్సలు
● నేడు ప్రపంచ అనెస్తీషియా దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ప్రమాదాల్లో మనకు చిన్న గాయమైతేనే నొప్పితో అల్లాడిపోతాం. అలాంటిది ఒక మనిషికి ఆపరేషన్ చేసేందుకు కత్తితో కోసి లోపలి అవయవాలను సరిచేసి, ఆపై చర్మానికి కుట్లు వేస్తారు. ఈ మొత్తం ప్రక్రియను తలచుకుంటేనే ఆందోళన మొదలవుతోంది కదూ...మత్తుమందు(అనెస్తీషియా) వచ్చాక గుండె ఆపరేషన్లు సైతం ఎంతో హాయిగా నొప్పిలేకుండా చేసుకునే వీలుకలిగింది. నే ప్రపంచ అనెస్తీషియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

వందకుపైగా అనెస్తీషియా వైద్యులు.. 70 వేలకుపైగా ఆపరేషన్లు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్, 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఏడాదికి 15 మంది పీజీలతో కలుపుకుని మూడేళ్లకు మొత్తం 45 మంది పీజీలు ఇక్కడ చదువుకుంటూ వైద్యసేవలందిస్తూ ఉంటారు. ఇక్కడ 12 ఆపరేషన్లు థియేటర్లతో పాటు ఎంఆర్ఐ, సీటీ స్కాన్, కేథలాబ్ విభాగాలు పలుమార్లు అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉంటారు. వీటిలో ప్రతి నెలా సగటును 1,250 మేజర్, 1,250 మైనర్ సర్జరీలు కలిపి ఏటా దాదాపు 30వేల ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. అలాగే నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిత్యం ఆపరేషన్లు జరుగుతుంటాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం వంద మందికి పైగా మత్తు మందు వైద్యులు ఉన్నారు. వీరి ఆధ్వర్యంలో ఏటా 70వేలకు పైగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

త్వరలో పెయిన్‌క్లినిక్ ఏర్పాటు

దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స చేయడానికి పెయిన్ క్లినిక్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇప్పటికే వీటిని ఏర్పాటు చేసి రోగులకు నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. ఇందులో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సిటి స్కానింగ్ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లులేని ప్రత్యేకమైన ఇంజెక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. ఇందులో భాగంగా నడుంనొప్పి, మోకాలునొప్పి, మెడనొప్పి, తలనొప్పి, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి తగ్గిస్తారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే నొప్పులకు లేబర్ అనెల్జిషియా పద్ధతితో నొప్పిలేని కాన్పు(పెయిన్‌లెస్ లేబర్) సైతం నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో పెయిన్ క్లినిక్‌తో పాటు పెయిన్‌లెస్ లేబర్‌లను సైతం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మత్తు మందు కనిపెట్టక ముందు..

పూర్వం మత్తుమందు కనిపెట్టకముందు మనదేశానికి చెందిన శుశ్రుత అనే శస్త్రచికిత్సా వేత్త రోగులకు మద్యాన్ని తాగించి, వారు మద్యం మత్తులో ప్రపంచాన్ని పట్టించుకోకుండా ఉన్న స్థితిలోకి వెళ్లినప్పుడు శస్త్రచికిత్స చేసి చెడిపోయిన శరీర భాగాలను చక్కగా సవరించేవారు. ఆయన శస్త్రచికిత్స, ప్లాస్టిక్ సర్జరి అనే రెండు విభాగాలకు మార్గదర్శిగా నిలిచి శరీరంలో ఏ శస్త్రచికిత్స అయినా రోగికి నొప్పి లేకుండా ఉండటం ఎంతో అవసరమైని ఒక నిర్దిష్టమైన సంకేతానిచ్చాడు. అమెరికాలోని బోస్టన్ నగరంలో మాసాచూట్స్ జనరల్ ఆసుపత్రిలో విల్లియమ్ థామస్ గ్రీన్ మోర్టన్ అనే వైద్యుడు 1846 అక్టోబర్ 16న 'డైఇథయిల్ ఈథర్' అనే త్వరితంగా ఆవిరయ్యే రసాయన ద్రవంతో రోగికి నొప్పి లేకుండా ఆపరేషన్ చేసి సఫలీకృతుడయ్యాడు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనెస్తీషియా దినంగా నిర్వహిస్తున్నారు.

క్రిటికల్ కేర్‌లో కీలకపాత్ర

రోగి ప్రాణాపాయస్థితిలో అత్యవసర చికిత్స అవసరమై, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడే అత్యవసర చికిత్స రథసారధిగా ఉండి రోగి ముఖ్యమైన అవయవాలు ఇబ్బందిలో పడినప్పుడు వాటిని ఒక కొలిక్కి తీసుకొచ్చి ప్రాణాలను కాపాడటంలో ప్రధాన పాత్ర వహించేది అనెస్తీషియా వైద్యుడు. క్లుప్తంగా చెప్పాలంటే క్రిటికల్ కేర్ విభాగంలో కీలకమైన వైద్యులు వీరే. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు సిరలు, జీర్ణవాటిక ద్వారా ప్రత్యేక రీతిలో శరీరానికి అవసరమైన పిండి, మాంసకృతులు ఇతర అత్యవసర పోషక పదార్థాలను అందజేయడంలో అతనే కీలక పాత్ర పోషిస్తాడు. అత్యవసర చికిత్సలో రోగి విషమ పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రాణాలను కాపాడే క్రిటికల్ కేర్ ఫిజీషియన్ కూడా మత్తు మందు డాక్టరే.



● అనెస్తెషియా వైద్యుడంటే...!

తలనుంచి గోరు దాకా శరీరంలోని ప్రతి అవయవానికి సంబంధించి శస్త్రచికిత్సకు, వ్యాధిపరంగా వచ్చే ఇబ్బందులకు తనకంటూ ఉన్న ఒక ప్రత్యేక శైలిలో నివారణోపాయాలను కనుగొంటూ రోగికి ప్రాణాపాయం కలగకుండా, శరీరంలోని ప్రధానమైన అవయవాలైన మెదడు, గుండె, వెన్నుపూస, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణాశయం, కండరాలు, ఎముకలు, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, చర్మం వంటి అన్ని అవయవాలకు ఎలాంటి నొప్పి, ఇబ్బంది లేకుండా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు గట్టి పునాదిని వేసే వారే అనెస్తీషియా వైద్యులు. ఒక్క మాటలో చెప్పాలంటే వైద్యశాస్త్రంలో అసలైన, సిసలైన బహుముఖ ప్రజ్ఞాశాలి వీరు మాత్రమే.

ఆపరేషన్ సమయంలో కీలకం



ఆపరేషన్ నిర్వహించే సమయంలో అనెస్తీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల కంటే మాదే పెద్ద డిపార్ట్‌మెంట్. ప్రస్తుతమున్న యూనిట్లతో పాటు త్వరలో స్టేట్ క్యాన్సర్ యూనిట్‌లో 5 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. అక్కడ మూడు ఆపరేషన్ థియేటర్లు కూడా ఏర్పాటు కానున్నాయి. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో భాగంగా క్యాజువాలిటీలో మత్తుమందు వైద్యులు ఉత్తమ సేవలందిస్తున్నారు.

–డాక్టర్ జి. విశాల, అనెస్తీషియా విభాగం హెచ్ఓడి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నొప్పిలేని చికిత్స



నొప్పిలేని గమ్మత్తు చికిత్స అనెస్తీషియా. ఇది ఆవిర్భావం కాకపోతే ఇన్ని రకాల ఆరోగ్య సమస్యలు పరిష్కారమయ్యేవి కావు. అనెస్తీషియా లేకుండా ఆరోగ్యసంరక్షణ ఊహించడం దాదాపు అసాధ్యం. సాధారణ అనెస్తీషియాలో రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు. వారు ఎలాంటి అనుభూతికి లోనుకారు. శ్వాస తీసుకోవడం, ఐవీ ద్వా రా ఔషధాన్ని స్వీకరిస్తారు. అనెస్తీషియా విధానం రాకపోతే శస్త్రచికిత్సలు చేయడం కష్టమయ్యేది. అనెస్తీషియా ఆవిర్భావం విప్లవాత్మకమైనది.

– డాక్టర్ బి. సుదర్శన్‌రెడ్డి, క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు, కర్నూలు

క్లుప్తంగా

పోలీసు అవుట్‌పోస్ట్ పరిశీలన



అవుట్ పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్) : కలెక్టరేట్ లోపలికి వెళ్లే మెయిన్ గేట్ వద్ద ఉన్న పోలీసు అవుట్ పోస్టును కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం పరిశీలించారు. లోపలికి వెళ్లి సదుపాయాలపై ఆరా తీశారు. నీటి వసతిని కల్పించాలని అక్కడి సిబ్బంది కోరారు. అందుకు ఆమె వెంటనే స్పందించి వాటర్ బేసిన్ ఏర్పాటు చేయించాలని డీఆర్వో కె.మధుసూదనరావుకును ఆదేశించారు.

ఫుట్‌బాల్ విజేత సీసీ సంఘం

కర్నూలు (టౌన్) : గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి 28వ సంఘం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఆదివారం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో కోల్స్ చర్చి సంఘం 7 ఏ సైడ్ జట్టు 2–1 స్కోర్‌తో గిప్సన్ సంఘం సీనియర్ జట్టుపై విజయం సాధించింది. క్రీడల నిర్వహణ కమిటీ కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో 15 జట్లు పాల్గొన్నాయని, కామ్–టు– హెవెన్ జట్టు ప్రత్యర్థి ఇమ్మానియేలు జట్టుపై నిర్ణీత 7 ఓవర్లలో 81 పరుగులు చేసి విజయం సాధించిందని తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు సిల్వర్ జూబ్లీ వేడుకల్లో బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



జాతీయస్థాయి క్రీడాకారిణి సుగంధిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ అన్నారు. బేటీ బచావో బేటి పఢావో కార్యక్రమంపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు 70 మంది సీఆర్‌పీఎఫ్ మహిళా అధికారులు కాశీ నుంచి కన్యాకుమారికి ర్యాలీ చేస్తూ కర్నూలుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా తైక్వాండో క్రీడాంశంలో జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లాకు చెందిన డి. సుగందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీఓ శారద, సీడబ్ల్యూసీ సభ్యులు మధు సుధాకర్, తైక్వాండో కోచ్ షబ్బీర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథ పాలకులు పెద్దక్క అన్నారు. దసరా సెలవులను పురస్కరించుకొని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్ రెడ్డి, విశ్రాంత తహసీల్దార్ శంకర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ గోవిందరెడ్డి విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మాజీ రాష్ట్ర పతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం ఏషియన్ వాస్క్యులర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ భార్గవ్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధికారి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి నాగలక్ష్మి పాల్గొన్నారు.

మట్టి లారీ సీజ్

కర్నూలు (న్యూసిటీ): బి.తాండ్రపాడు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. సీజ్ చేసిన లారీని భద్రత నిమిత్తం తాలుకా పోలీసుస్టేషన్‌లో పెట్టామని చెప్పారు. లారీలో ఎంత మేర గ్రావెల్‌ను తరలిస్తున్నారని అంచానా వేసి యజమానికి జరిమానా విధిస్తామన్నారు. తనిఖీలో టెక్నికల్ అసిస్టెంట్ బాలు నాయక్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

'బీజేపీ విధానాలను తిప్పికొట్టండి'

కర్నూలు(సెంట్రల్) : బీజేపీ మతతత్వ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు సోమసుందరం పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నగర కమిటీ సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు కొనసాగాయి. కార్యక్రమంలో కె. జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సంస్థ సీఎండీ రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీ ఎస్‌పీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు సోమవారం రాత్రి కర్నూలుకు రానున్నారు. మంగళవారం ఉదయం స్థానిక విద్యుత్ భవన్‌లో జరిగే కర్నూలు, డోన్ డివిజన్ల సమీక్ష సమావేశంలో పాల్గొనున్నారు.

సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పథకాలు



నరసింహారెడ్డి నగర్‌లో మహిళతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

● ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
● 46వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన సచివాలయ వ్యవస్థ పేదల ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక 46వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నరసింహారెడ్డి నగర్, రైల్వే స్టేషన్ మసీదు ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల మంజూరు, చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు సమస్యలు తెలుసుకొని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం తెచ్చేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని చెప్పారు. ఇందులో భాగంగానే వలంటీర్లు ప్రభుత్వ సేవలను ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పథకాలు వచ్చేవి కావని, టీడీపీ జన్మభూమి కమిటీలు సిఫార్సులు చేసిన వాళ్లకే మంజూరు చేసేవారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి రోజులు పోయాయని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వాసు, నాయకులు శౌరి విజయకుమారి, సురేష్, ఆంజనేయులు, విజయభాస్కర్ రెడ్డి, కమల్‌బాషా, కిరణ్, మల్లికార్జున, కృష్ణవేణి పాల్గొన్నారు.

రాంబొట్ల ఆలయ అభివృద్ధికి చర్యలు

కర్నూలు కల్చరల్: రాంబొట్ల ఆలయం అభివృద్ధికి చర్యలు తన వంతు కృషి చేస్తానని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం కర్నూలు పాతనగరంలోని రాంబొట్ల ఆలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 80 లక్షలు నిధులు కేటాయించిందన్నారు. ఈ నిధులతో ఆలయాన్ని పర్యాటక ప్రాముఖ్యతను సంతరించుకునే విధంగా తీర్చి దిద్దుతామన్నారు. ఆలయం ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. అనంతరం రాంబొట్ల ఆలయం నిర్మాణానికి స్థానిక వార్డు కార్పొరేటర్ సుజాతమ్మ రూ.లక్ష, సోమిశెట్టి వెంకట్రామయ్య రూ.లక్ష, 46వ వార్డు కార్పొరేటర్ వాసు రూ. లక్ష, విరాళాలు ప్రకటించారు. కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ అర్షియా పర్వీన్, తెలుగు అనిల్‌కుమార్, శేషయాదవ్, రియాజ్ బాబా, శర్మ, అనిల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దసర శరన్నవరాత్రులను పురష్కరించుకొని ఓల్డ్ సిటీలోని జమ్మిచెట్టు, మహా లక్ష్మి దేవాలయంను ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, స్థానిక కార్పొరేటర్లు సందర్శించి పరిశీలించారు.

అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

కర్నూలు(రాజ్‌విహార్): భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గొప్ప శాస్త్రవేత్త అయిన అబ్దుల్ కలాం మిసైల్స్ మెన్‌గా పేరు తెచ్చుకొని, దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్వేతారెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, యూనుస్, రసూల్‌ఖాన్, శివ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు

అబ్దుల్ కలామ్ సేవలు మరువలేం

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ సేవలను దేశం మరువలేదని ఎస్‌డీపీఐ నగర అధ్యక్షుడు అశ్వాక్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఎస్‌డీపీఐ పార్టీ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జలీల్, చాంద్, షఫీ, షేక్షావలి, హబీబ్‌ఖాన్, అబ్దుల్లా, సలీంబాషా పాల్గొన్నారు.

అలరించిన 'భువన విజయం' నాటకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



భువన విజయం నాటకంలో ఆకట్టుకున్న సన్నివేశం

కర్నూలు కల్చరల్: వారందరూ ఇంటర్ చదువుతున్న విద్యార్థినులు. తమలోని కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. 'భువన విజయం' నాటకం వేసి ప్రేక్షకులను మెప్పించారు. ఇందుకు కర్నూలులోని సీక్యాంప్ కళాక్షేత్రం వేదికైంది. బనవాసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఆదివారం 'భువన విజయం' నాటకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణ దేవరాయల పాత్రలో కృష్ణప్రియ, తిమ్మరుసు పాత్రలో మహాలక్ష్మితో పాటు సునీత, చాందిని, పవిత్ర, చరిత, శృతి, శ్రావణి, అక్షర, సంధ్య, నందిని, సుజిత, వివిధ పాత్రలను పోషించారు. అంతకు ముందుకు ఆర్ఐవో గురవయ్య శెట్టి, డీవీఈవో జమీర్ బాషా, కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, తెలుగు భాషా వికాసం ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కేశర్మ, డీఎస్పీ మహబుబ్ భాష జ్యోతి ప్రజ్వలనతో నాటకాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ఈ సదర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ బాలికలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం కళాక్షేత్రం తరపున విద్యార్థినులకు రూ.25 వేలు పారితోషికం అందజేశారు. బనవాసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస గుప్త, అధ్యాపకులు కృష్ణ, సంస్కృత అధ్యాపకులు వెంకటరమణలను సన్మానించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్‌మియ్యా, ఉపాధ్యక్షులు ఇనాయతుల్లా, సీవీ రెడ్డి, సభ్యులు గాండ్ల లక్ష్మన్న, యాగంటీశ్వరప్ప, కోశాధికారి లక్ష్మీకాంతరావు తదితరులు పాల్గొన్నారు.



నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా



వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో..



పెద్ద అమ్మవారి శాలలో బాలా త్రిపుర సుందరిగా..



గీత మందిరంలో సీతా మహాలక్ష్మిగా



కర్నూలు నిమిషాంబా దేవి ఆలయంలో

నవ్య శోభితం.. శరన్నవరాత్రి పూజితం

● ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
● వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు
● అమ్మవారిని దర్శించుకుని తరించిన భక్తులు



చిన్న అమ్మవారి శాలలో మణి ద్వీపం ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు కల్చరల్: దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గోపూజ, రథోత్సవం, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటుచేసి పూజలు చేశారు. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పేరంటాలు నిర్వహించారు. కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయం, పెద్ద అమ్మవారిశాలలో బాలా త్రిపుర సుందరిదేవిగా, వన్‌టౌన్ వద్ద గీతా మందిరంలో సీతా మహాలక్ష్మిగా, పూలబజార్ చిన్నమ్మ వారి శాలలో అన్నపూర్ణేశ్వరిగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా అలంకరించారు. చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, బండిమెట్ట అంబాభావని ఆలయం, బుధవార పేట కాళికాంబ ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. చిన్నమ్మ వారి శాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, మణి ద్వీపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో గోపూజ, రథోత్సవం, కోలాటం, హరికథా, అన్నమాచార్య సంకీర్తనలు ఏర్పాటు చేశారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు చిన్న అమ్మవారి శాల, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.



చిన్న అమ్మవారి శాలలో విద్యార్థుల నృత్య ప్రదర్శన



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

చేతుల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు(అగ్రికల్చర్): భోజనానికి ముందు, బాత్‌రూమ్, టాయ్‌లెట్స్‌కు వెళ్లినప్పుడు చేతులు శుభ్రం చేసుకోవడంపై ప్రజలకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ పరిపాలనాధికారి షరీఫ్ తెలిపారు. హ్యాండ్ వాష్‌తో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ–వైకేపీ కార్యాలయంలో వైకేపీ ఏపీఎం(హెచ్‌డీ) సుబ్బయ్య ఆధ్వర్యంలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. డీఆర్‌డీఏ–వైకేపీకి అన్ని మండలాల్లో హ్యాండ్ వాష్ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై పొదుపు మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చేతులను సరిగా శుభ్రం చేసుకోకపోతే క్రిములు కడుపులోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఇది అనేక అనారోగ్యాలకు దారి తీస్తుందని వివరించారు. డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, ఏపీఎంలు కరుణాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయంలో వరల్డ్ హ్యాండ్ వాష్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, సంపూర్ణ ఆరోగ్యం కోసం చేతులను పరిశుభ్రంగా ఉంచుకొవాలని మెప్మా టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సంఘాల గ్రూపులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రూపు సభ్యులు నగరపాలక కార్యాలయం నుంచి మెప్మా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు రియాజ్, నగేష్, రవికుమారి, సుధాకర్ పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డి జీవితం ఆదర్శనీయం

కర్నూలు(సెంట్రల్) : ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వెంకట్రామిరెడ్డి జీవితం యువ తరానికి ఆదర్శమని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి అన్నారు. దేవనకొండ మండలం తెర్నేకల్‌కు చెందిన వెంకట్రామిరెడ్డి విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐ, ఉద్యోగి దశలో సీపీఎం అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, ఆయన మరణం పార్టీకి, ఉద్యమానికి తీరని లోటన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఇటీవల మరణించిన వెంకట్రారెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి డాక్టర్ లక్ష్మీనారాయణ, ధనుంజయ, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు ప్రభాకరరెడ్డి, వెంకట్రామిరెడ్డి కుమారుడు శేషాద్రి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలకపల్లి రవి